## గ్రూప్-2 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 14 : జిల్లాలో ఆది, సోమవారాల్లో నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రీజినల్ కో-ఆర్డినేటర్, నోడల్ అధికారి వెంకన్న తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 17 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 4,423 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. మొత్తం ఆరు రూట్లను ఏర్పాటు చేసి, 17 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 17 మంది అబ్జర్వర్లు, స్పెషల్ ఫ్లెయింగ్ స్క్వాడ్స్‌ను నియమించామన్నారు. ఆదివారం ఉదయం పరీక్షకు 8:30, మధ్యాహ్నం పరీక్షకు 2 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లవచ్చని సూచించారు. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. పరీక్ష సమయం ముగిసే వరకు అభ్యర్థులను బయటకు పంపించడం కుదరదని ఆయన స్పష్టం చేశారు.

**పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు : ఎస్పీ కిరణ్ ఖరే**

ఈ నెల 15,16వ తేదీల్లో జరిగే గ్రూప్-2 రాత పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జిల్లా పోలీస్‌శాఖ పటిష్ట భద్రతా ఏర్పాటు చేసిందని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 163బీఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందన్నారు.

## ఆటల పోటీలు ప్రారంభం

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 14 : సింగరేణి డేను పురస్కరించుకుకొని కృష్ణకాలనీలోని అంబేద్కర్ స్టేడియంలో శనివారం మహిళలకు వివిధ రకాల ఆటల, పోటీలు నిర్వహించగా సింగరేణి భూపాలపల్లి ఏరియా అధికార ప్రతినిధి మారుతి ప్రారంభించారు. తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పోటీలలో పాల్గొనే మహిళలకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. గెలుపొందిన వారికి 23న ముఖ్య అతిథులు చేతుల మీదుగా బహుమతులను అందజేయనున్నట్లు చెప్పారు. డిసెంబర్ 17న 1000 క్వాటర్స్, రామప్ప కాలనీలలో, 18న బంగ్లాస్ ఏరియా, ఏరియా హాస్పిటల్‌లో, 19న రంగవల్లి, దీపాలంకరణ పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమములో ఎస్ఆర్ పీవో శ్రావణ్‌కుమార్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పర్స శ్రీనివాస్, సేవా సెక్రటరీ జీ లక్ష్మి, సేవా సభ్యులు పుష్పలత, అరుణ పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో 1882 కేసుల పరిష్కారం

ములుగురూరల్, డిసెంబర్ 14 : ములుగు జిల్లా కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మూడు బేంచీలను ఏర్పాటు చేసి మొత్తం 1882 కేసులను పరిష్కరించినట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎస్.వి.పి. సూర్యచంద్రకళ తెలిపారు. ఇందులో ఎంవీ ఓపీ కేసులు 6పరిష్కరించి కాంపిన్సేషన్ రూ.7,50,000, క్రిమినల్ 336, సివిల్ 29, సమ్మరి ట్రయల్ కేసులు 1503, ఫ్రీ లిటిగేషన్ బ్యాంకు కేసులు, బీఎస్ఎన్ఎల్ కేసులు 23 బ్యాంకు రికవరీ కింద రూ.13,01405లను రికవరీ తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టీ కన్నయ్యలాల్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సౌఖ్య, డీఎస్పీ రవీందర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వినయ్‌కుమార్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రుదిర, సీఐ శంకర్, ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కుమార్, ఎస్సై సీహెచ్ వెంకటేశ్వర్‌రావు, ఎస్సై సతీశ్, న్యాయవాదులు సునీల్‌కుమార్, నర్సిరెడ్డి, వేణుగోపాల్, చంద్రయ్య, మేందర్, రవీందర్, స్వామిదాస్, రామ్‌సింగ్, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, ప్రతాప్, గట్టయ్య, కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలు రాజీ మార్గాన్ని అలవాటు చేసుకోవాలి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు**

కృష్ణ కాలనీ : ప్రజలు ద్వేష భావాలను తగ్గించుకొని, రాజీ మార్గాన్ని అలవాటు చేసుకుంటే మంచిదని భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పీ నారాయణబాబు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు మాట్లాడుతూ ప్రజలు ద్వేష భావాలను తగ్గించుకొని రాజీమార్గాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. దీంతో విలువైన సమయం, డబ్బు దుర్వినియోగం కాదన్నారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్‌జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే జయరాంరెడ్డి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్ రామచంద్రరావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జీ అఖిల, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు లింగంపల్లి విష్ణువర్ధన్‌రావు, ప్రధాన కార్యదర్శి బల్ల మహేందర్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ మెరుగు రవీందర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ అక్షయ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ జీ ప్రియాంక, బెంచ్ మెంబర్లు మంగళంపల్లి రాజ్‌కుమార్, సురేందర్, అశోక్‌రెడ్డి, కనపర్తి కవిత, న్యాయవాదులు సంగేమ్ రవీందర్, రజినీకాంత్, పాల్గొన్నారు.

# విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

- మహిళా సాధికారితే లక్ష్యంగా పనిచేస్తున్నాం..
- రాష్ట్ర వ్యాప్తంగా 16 నర్సింగ్ కాలేజీలను మంజూరు చేశాం
- మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

డైట్ మెనూను ప్రారంభిస్తున్న మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ

కృష్ణ కాలనీ/భూపాలపల్లి రూరల్/గణపురం, డిసెంబర్ 14 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులమంతా విద్య, వైద్యం, మహిళా సాధికారతే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి కేటీకే- 2 ఇంక్లైన్ వరకు బీటీ రోడ్డు పనులకు మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు. భూపాలపల్లి మండలంలోని భాగిర్థిపేట ఆర్చివద్ద రూ.50కోట్లతో బుద్దారం-కొడవటంచ బీటీ డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీ పనులు, భూపాలపల్లిలో రూ.15 కోట్లతో 50పడకల ఆయుష్ భవన నిర్మాణ పనులు, రూ.130కోట్లతో మెడికల్ కాలేజీ బిల్డింగ్ కాంప్లెక్స్ పనులు, రూ.13కోట్లతో ప్రభుత్వ వైద్యశాలలోని 3వ అంతస్తులో గదుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరేతో కలిసి శంకుస్థాపన చేశారు. వైద్యశాలలో డాక్టర్లతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. గణపురం మండలం గాంధీనగర్ మహాత్మా జ్యోతి బాపూలే వసతి గృహంలో మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీతో కలిసి నూతన డైట్‌మెనూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా 16 నర్సింగ్ కాలేజీలు మంజూరు చేశామని, వాటిలో ఒకటి భూపాలపల్లికి ఇచ్చినట్లు తెలిపారు. భూపాలపల్లిలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామని, ప్రతి నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన తర్వాతనే ఎన్నికల్లో ఓట్లు అడుగుతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా చదువుతోపాటు భోజనం విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తుందన్నారు. పిల్లల బంగారు భవిష్యత్‌కు ఆలోచనలు చేసి యూనిఫామ్‌గా డైట్ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు చెప్పారు. 40శాతం డైట్ చార్జీలు, 200శాతం కాస్మొటిక్ చార్జీలు పెంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

**మధ్యాహ్నం నుంచి పడిగాపులు**

జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రులు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. అయితే, ఈ సభకు స్థానిక కాంగ్రెస్ నాయకులు భూపాలపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న గ్రామాలు, భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల నుంచి ప్రజలను తరలించారు.

షెడ్యూల్‌లో మంత్రుల సభ ఉదయం 11 గంటలకు ఉండగా, ప్రజలను సభా ప్రాంగణానికి ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు వివిధ వాహనాల్లో తరలించారు. కానీ, మంత్రులు మాత్రం సమయానికి రాలేదు. వారి రాక కోసం ప్రజలు మధ్యాహ్నం నుంచి పడిగాపులుగాచారు.కొంతమంది మహిళలు వెనుదిరిగి వెళ్లిపోయారు. వారిని ఆపేందుకు తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఆటపాటలను ప్రదర్శించారు. ఎంతకూ మంత్రులు రాకపోవడంతో జనం విసుగెత్తిపోయారు. పూర్తిగా సభాసమయం ముగిసిపోయాక, సాయంత్రం 3:30నుంచి 4 గంటల మధ్య సభకు చేరుకున్నారు. పొద్దంతా సభా ప్రాంగణం వద్ద ప్రజలు మంత్రులరాక కోసం పడిగాపులు గాయాల్సి వచ్చింది.

## ఆ జీవోతో ఉద్యోగ నియామకాల్లో అన్యాయం

కాటారం, డిసెంబర్ 14 : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయం చేసే జీవో నంబర్ 29ను ప్రభుత్వం పునఃసమీక్షించాలని ఉత్తర తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు పీక కిరణ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం తీసుకవచ్చిన జీవోతో ఎస్సీ,ఎస్టీ, బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. గతంలో వంద ఉద్యోగాలు ఉంటే 50 ఉద్యోగాలు ప్రతిభ ఆధారంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. మిగతా 50లో ఎస్సీలకు 16 శాతం, ఎస్టీలకు 11 శాతం, బీసీలకు 25 శాతం పద్ధతుల్లో ఉద్యోగ నియామకాలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం జీవో 29 ద్వారా మొదటి 50లో 10 మంది ఎస్సీలకు ఉద్యోగాలు వచ్చాయనుకుంటే ఆ పది ఉద్యోగాలు వదిలి మిగతా ఆరు ఉద్యోగాలు ఇస్తున్నారన్నారు. మెరిట్ ద్వారా ఉద్యోగం వస్తే ఓపెన్ కాంపిటేషన్‌లో వదిలేయాలన్నారు. కానీ 10 మంది లెక్కకు తీసుకోవడం వల్ల ఆరుగురు ఎస్సీలను తీసుకొని 16 శాతం కోట అయిపోయిందని అంటున్నారన్నారు. దీని వల్ల మరో పది మంది దళిత విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. ఉద్యోగ నియామకాల్లో నష్టం చేకూర్చే జీవోను వెంటనే మార్చి పాత పద్ధతిలోనే నియామకాలు చేపట్టాలన్నారు.

## ఆర్‌యూపీపీ జిల్లా శాఖ ఎన్నిక

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 14 : రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు (ఆర్‌యూపీపీ-టీ) జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా బైరి నరసింహాస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం జిల్లా కేంద్రంలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అబ్దుల్లా హాజరై జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బైరి నరసింహస్వామి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ షహీద్‌మహ్మద్, గౌరవ అధ్యక్షుడిగా ఏ ప్రతాప్, గౌరవ సలహాదారు ఎస్ శివశంకర్, సహాయ అధ్యక్షుడిగా కుసుమ సురేశ్, ఉపాధ్యక్షులుగా శరత్‌బాబు, చంద్రమౌళి, భాస్కర్, రఘుపతి, అమ్జద్ షేక్, మహిళా ఉపాధ్యక్షులు శిరీషాభాయి, అదనపు ప్రధాన కార్యదర్శి రాజబాబు, కార్యదర్శులుగా సదయ్య, సురేశ్, రాజారావు, మహిళా కార్యదర్శి జ్యోతి, కోశాధికారి అయోధ్య, రాష్ట్ర ప్రతినిధులుగా లక్ష్మయ్య, అశోక్, సభ్యులుగా జ్యోతి, రవీందర్, సదయ్యను ఎన్నుకున్నారు.

## ముదిరాజ్‌లు ఐక్యతతో పోరాడాలి

ములుగురూరల్, డిసెంబర్ 14 : ముదిరాజ్‌లు ఐక్యతతో ఉండి హక్కుల సాధనకు పోరాడాలని మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు. శనివారం ఆయన ములుగు జిల్లా మెపా ప్రధాన కార్యదర్శిగా కుక్కల నాగరాజు, గౌరవ అధ్యక్షుడిగా బండి రాజును నియమిస్తూ వారికి నియామక పత్రాలు అందించారు. జిల్లాలోని అన్ని మండల కమిటీలను ఏర్పాటు చేసి జాతి అభివృద్ధి, ఐక్యత, రిజర్వేషన్ సాధన కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొట్లపల్లి సంజీవ్‌కుమార్, ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, జిల్లా అధ్యక్షుడు అచ్చునూరి కిషన్, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు సంకెళ్ల శ్రీధర్, నాయకులు ఆళ్ల నరేశ్, బండి రామ్, రామకృష్ణ, చిరంజీవి, రాజు ఉన్నారు.

## సమగ్ర శిక్షా ఉద్యోగుల వినూత్న నిరసన

కాటారంలో నిరసన చేపడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కాటారం, డిసెంబర్ 14 : తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏండ్లుగా సమగ్ర శిక్షాలో కీలక అనుసంధానకర్తలుగా పని చేస్తున్నామని, పాఠశాలలకు, ప్రభుత్వానికి మధ్య సమన్వయం చేస్తూ విధులు నిర్వహిస్తున్నా తగిన వేతనాలు అందడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి హామీ మరుగున పడిందన్నారు. కార్యక్రమంలో మల్హర్, కాటారం సమగ్ర శిక్షా ఉద్యోగులు వరప్రసాద్, రవిశంకర్, సురేశ్, సంపత్, సమ్మయ్య,రోజారాణి, నళిని, కవిత, స్వప్న, రాజేశ్వరి, శ్రీలత, అరుణ, శిరీష పాల్గొన్నారు.

**సమ్మెకు ఎస్టీయూ, టీపీటీఎఫ్ మద్దతు**

ములుగురూరల్ : ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయ సమీపంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపడుతున్న సమ్మె శనివారం 5వ రోజుకు చేరుకుంది. సమ్మెకు ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్, టీపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు హట్కార్ సమ్మయ్య వేర్వేరుగా హాజరై మద్దతు ప్రకటించారు. సమగ్ర శిక్షా ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. విద్యాశాఖలో వారిని విలీనం చేయాలని అన్నారు. సమ్మెలో ఎస్టీయూ నాయకులు రాష్ట్ర కోశాధికారి సదయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శిరుప సతీశ్, ఏళ్ల మధుసూదన్, నాయకులు శంకర్, కృష్ణయ్య, రమేశ్, రాంబాబు, కసన్ సింగ్, హమీద్, రవిచందర్, బాలాజీ, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె నాగరాజు, ఉపాధ్యక్షులు గుగులోత్ రాందేవ్, సాంబయ్య, వైనాల స్వామి, భద్రునాయక్, సమగ్ర శిక్షా ఉద్యోగులు భాస్కర్‌రెడ్డి, కరుణాకర్, కుమార్‌పాడ్యా, జీవనప్రియ, ఫిరోజ్, సుజాత, రమేశ్, స్వాతి, స్వప్నలత, ప్రవీణ్, చిరంజీవి పాల్గొన్నారు.

## ఆదివాసీలకు అన్యాయం చేస్తున్న పాలకులు

తాడ్వాయి, డిసెంబర్ 14 : ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీలకు పాలకులు తీవ్ర అన్యాయం చేస్తున్నారని గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ముద్దబోయిన రవి ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలోని అభివృద్ధి పనులను ఆన్‌లైన్ టెండర్ల పేరిట కాంగ్రెస్ పార్టీ నాయకులు పులి సంపత్, బత్తిని రాజులకు కేటాయిస్తూ పాలకులు, అధికారులు ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. మేడారంతోపాటు జాతర పరిసరాలలో వచ్చే ప్రతి పని వారికే ఎలా వస్తున్నాయో అధికారులు తెలుపాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లు ఇచ్చే పర్సెంటేజీలకు అమ్ముడుపోయి ఆదివాసీల మనుగడలేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీలో రాజకీయ పలుకుబడితో పనులను ఆదివాసీలకు దక్కకుండా చేస్తున్నారని వాపోయారు. ఇవన్నీ తెలిసినా అటు ప్రభుత్వం గానీ మంత్రిగానీ పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ విషయమై తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ ఏరియా రక్షకులు గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేయడంతో పాటు సీబీసీఐడీతో ఎంక్వైరీ జరిపించి హైకోర్టులో కేసు నమోదు చేస్తామన్నారు.

చిట్యాల : డైట్ మెనూ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎస్ఆర్

కాటారం : మెనూ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్

# హాస్టళ్లలో కొత్త డైట్ మెనూ

**ప్రారంభించిన ప్రజాప్రతినిధులు, అధికారులు**


ములుగులో కామన్ డైట్ మెనూను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ట్రైబల్ వెల్ఫేర్ కమిషనరేట్ జాయింట్ డైరెక్టర్

ములుగు రూరల్/ చిట్యాల/ కాటారం/ మహదేవపూర్/ భూపాలపల్లి రూరల్/ మొగుళ్లపల్లి/ మల్హర్/గోవిందరావుపేట/వెంకటాపూర్/ ఏటూరునాగారం/మంగపేట/కన్నాయిగూడెం, డిసెంబర్ 14 : ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచి ఏర్పాటు చేసిన కామన్ డైట్ మెనూను శనివారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర, ట్రైబల్ వెల్ఫేర్ కమిషనరేట్ జాయింట్ డైరెక్టర్ సముజ్వల, ములుగు గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, మహదేవపూర్ ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు ప్రారంభించారు. శనివారం చిట్యాల మండలకేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకులం, కాటారం మండలంలోని గిరిజన సంక్షేమ బాలుర, బాలికల గురుకులాలు, మహదేవపూర్ మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతి గృహంలో, ములుగు మండలంలోని జగ్గన్నపేట ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో, జగ్గన్నపేట ఆశ్రమ కళాశాలలో మెగా డైట్‌చార్ట్‌ను వారు ప్రారంభించారు. ఆహార పదార్థాల నాణ్యత, కిచెన్‌ను పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై ప్రభుత్వం కాస్మొటిక్, డైట్ చార్జీల పెంపుపై వివరించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ విద్యార్థులకు సక్రమంగా భోజనం అందేలా పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో డీడీ పోచం, డీఈవో పాణిని, పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి, గురుకులాల ఓఎస్డీ ఎల్ శ్రీనివాస్, ప్రిన్సిపాళ్లు గోల్కొండ భిక్షపతి, లాల్, నాగలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, నాయకులు దొడ్డి కిష్టయ్య, చిలకల రాయకొమురు, బుర్ర లక్ష్మణ్‌గౌడ్, ఆయా విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్ మానస, సునీత, వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్స్ రాజేందర్, మాధవి, వార్డెన్స్, పేరెంట్ కమిటీ ప్రతినిధులు శారద, రమాదేవి, శ్రీశైలం, సురేందర్, జ్యోతి పాల్గొన్నారు.

ములుగు మండలంలోని రాయినిగూడెం ఆశ్రమ బాలుర పాఠశాల, జాకారం మినీ గురుకులం, జాకారం, మల్లంపల్లి సోషల్ వెల్ఫేర్, బండారుపల్లి టీజీఆర్ఎస్, దేవగిరిపట్నం మైనార్టీ గురుకులం, జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల, బాలుర గురుకులాల్లో కామన్ డైట్ మెనూ కార్యక్రమాలను మండల, జిల్లా స్థాయి అధికారులు ప్రారంభించారు. అనంతరం గురుకుల విద్యార్థులతో కలిసి ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి భోజనం చేశారు. మండల పరిధిలోని చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో హెచ్ఎం సపక నాగరాజు, తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, ఎంఈవో నారాయణ నూతన మెనూ ప్రారంభించారు. మాజీ సర్పంచ్ నర్సింహామూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. భూపాలపల్లి తెలంగాణ మైనార్టీ జూనియర్ కళాశాల (బాయ్స్ -1) లో నూతన డైట్ మెనూను జిల్లా పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ టి.గోపాలకృష్ణమూర్తి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఆయన భోజనం చేశారు. డైనింగ్ హాల్, కిచెన్ రూమ్, తరగతి గదులు, కళాశాల పరిసరాల శుభ్రతను పరిశీలించి ప్రిన్సిపల్ సీహెచ్ వేణుగోపాల్, వార్డెన్ షేక్ వలిపాషాను, సిబ్బందిని అభినందించారు. మొగుళ్లపల్లి ఎంజేపీ గురుకులంలో ఎంపీడీవో హుస్సేన్‌తో కలిసి మండల స్పెషల్ ఆఫీసర్ సునీత నూతన డైట్ మెనూ ప్రారంభించారు. మల్హర్ మండలం తాడిచర్ల ఎస్టీ హాస్టల్‌లో ఎంపీడీవో శ్యామసుందర్ ప్రారంభించారు. హాస్టల్‌లోని స్టోర్ రూంను సందర్శించి కూరగాయలు, సరకులు, ఆహార పదార్థాలను పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, వైద్యాధికారి వినయ్‌భాస్కర్ పాల్గొన్నారు. గోవిందరావుపేటలో కామన్ డైట్ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి తేజావతి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జితేందర్‌రెడ్డి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సరితతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. వెంకటాపూర్ మండలంలోని రామంజాపూర్ గ్రామంలోని పాఠశాలలో శనివారం ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలపై హెచ్ఎం శంకరయ్య అధ్యక్షతన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో రాజు, ఎంఈవో టీ ప్రభాకర్ హాజరయ్యారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ ధరంసింగ్, తిరుమల్‌సింగ్, గ్రామపెద్దలు భగవాన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. మంగపేట, ఏటూరునాగారం మండలాల్లోని చెల్పాక, చంచుపల్లి, ఏటూరునాగారంలోని ఆశ్రమ పాఠశాలల్లో శనివారం నుంచి అమలు చేస్తున్న కొత్త మెనూను ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా పరిశీలించారు. పెరిగిన మెనూ చార్జీలను తల్లిదండ్రులకు పీవో వివరించారు. పీవో వెంట ఎస్‌వో రాజ్‌కుమార్, జీసీఎంవో సుగుణ, హెచ్ఎంలు, ప్రత్యేకాధికారులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పాల్గొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించి వారి సమక్షంలో కొత్త మెనూను ప్రారంభించారు. కార్యక్రమాలో డీడీ పోచం, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఎంపీవో కుమార్, డీటీ అనీల్ పాల్గొన్నారు. మంగపేట మండలంలోని కోమటిపల్లి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శనివారం కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవానికి తహసీల్దార్ రవీందర్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం బ్రహ్మాచారి, అధ్యాపకులు గొప్ప సమ్మారావు, శ్రీనివాస్, లక్ష్మయ్య, వేణు, చెంచయ్య, బాలు, భాస్కర్, జగ్గారావు, క్రాంతి పాల్గొన్నారు. కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం, కన్నాయిగూడెం, ఐలాపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో అధికారులు శనివారం నూతన డైట్ మెను ప్రారంభించారు. ఆయా ఆశ్రమ పాఠశాలలకు ప్రత్యేక అధికారులుగా ఏపీడీ వెంకటనారాయణ, ఎంపీడీవో వనిత, తహసీల్దార్ వేణుగోపాల్‌ను నియమించారు. కార్యక్రమంలో ఏఈలు సాయిరాం, నర్సింహాచారి పాల్గొన్నారు.

## నాణ్యమైన భోజనం అందించాలి

గణపురం, డిసెంబర్ 14 : వసతి గృహ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ మధురకవి సత్యనారాయణ స్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతన మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలన్నారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో వార్డెన్ జ్యోతికుమార్, ఆర్ఐ దేవేందర్ పాల్గొన్నారు.

## ఆశ వర్కర్ల బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ములుగురూరల్, డిసెంబర్ 14 : నేటి నుంచి 31వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఆశ వర్కర్ల బస్సు యాత్ర పోస్టర్లను శనివారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ ఆవిష్కరించారు. బస్సు యాత్ర నేడు నిర్మల్ జిల్లాలో ప్రారంభమై ములుగు జిల్లాకు 27వ తేదీన చేరుతుందని, 31న ఇందిరమ్మ పార్క్ వద్ద ముగుస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఆశలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్ఆర్ నీలాదేవి, రజియా, సుజాత, రజిత, కేత, కవిత, నిఖిల్ పాల్గొన్నారు.

## వెంకటాపురం, కొత్తగూడలో గిరిజన దర్బార్లు

ఏటూరునాగారం డిసెంబర్14 : ఈనెల 16న వెంకటాపురం మండల పరిషత్ కార్యాలయంలో, 20న కొత్తగూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో గిరిజన దర్బార్ కార్యక్రమాలు నిర్వహించనున్న ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా శనివారం తెలిపారు. వెంకటాపురంలో నిర్వహించే దర్బార్‌లో వెంకటాపురంతోపాటు వాజేడు మండల గిరిజనులు కూడా వినతులు సమర్పించాలని పీవో కోరారు. అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

## అనారోగ్య బాధితులకు మాజీ ఎంపీటీసీ పరామర్శ

కాటారం, డిసెంబర్ 14 : మండలంలోని దుబ్బగూడెంలో అనారోగ్యంతో బాధపడుతున్న కొండ దీప, ముత్యాల పోశం, మాడం సమ్మయ్యతో పాటు పలు కుటుంబాలను మాజీ ఎంపీటీసీ తోట జనార్దన్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆ కాలనీలోని బోర్ చెడిపోయి నీటికి ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీ వాసులు ఆయన దృష్టికి తీసుకురాగా కొత్త బోర్ మోటారు వితరణ చేశారు. కార్యక్రమంలో నాయకులు జోడు శ్రీను, తోట బాపు, గంట శ్రావణ్, కొండ గొర్ల వెంకటస్వామి, గాలి సడవలి, కొండ తిరుపతి పాల్గొన్నారు.

## బొప్పారం వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా

కాటారం, డిసెంబర్ 14 : మండలంలోని చిద్నెపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బొప్పారం వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ప్రతి రోజూ ట్రాక్టర్ల ద్వారా మండలకేంద్రానికి తరలిస్తున్నారు. రెండో శనివారం, ఆదివారం రెండు రోజులు సెలవు ఉండడంతో అధికారులు ఆవైపు కన్నెత్తి చూడరనే ధీమాతో ఇసుకను బాజాప్తు తరలిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## గ్రావెల్ తరలిస్తున్న జేసీబీలు సీజ్

వెంకటాపురం(నూగూరు), డిసెంబర్ 14 : మండల పరిధిలోని వీరభద్రవరం గ్రామ సమీపంలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు జేసీబీలను రెవెన్యూ అధికారులు శనివారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ లక్ష్మీరాజయ్య తెలిపారు. వీరభద్రవరం గ్రామ సమీపంలో వీఆర్కెపురం ర్యాంపునకు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు చేసి రెండు జేసీబీలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఆర్ఐ మల్లయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 14 : అసభ్యకరమైన పదజాలంతో దూసిస్తూ, తన తలపై కర్రలతో కొట్టిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని దానబోయిన శంకర్ (36) కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో మీడియాతో బాధితుడు శంకర్ మాట్లాడుతూ భూపాలపల్లి మండలం నేరేడుపల్లి పల్లి గ్రామంలో నివసిస్తూ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపాడు. తన ఇంటి పక్కన నివసిస్తున్న వేముల శ్రీనివాస్, వేముల రమేశ్, వేముల ప్రేమలత తన ఇంటికి పాల కోసం, ఆటో కిరాయి కోసం వస్తున్న వారికి తన భార్య ప్రశాంతికి అక్రమ సంబంధం ఉందని చెబుతున్నారని తెలిపారు. శుక్రవారం ఉదయం అకారణంగా తన ఇంట్లోకి ప్రవేశించి అసభ్య పదజాలంతో దూసిస్తూ తనను కర్రలతో బలంగా కొట్టడంతో బలమైన గాయమైందన్నారు. సదరు ముగ్గురు వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఏటూరునాగారం, డిసెంబర్ 14 : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, శివాలయం కమిటీ మాజీ చైర్మన్ తాడూరి రఘు శనివారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వివాహ కార్యక్రమానికి రఘు దంపతులు ద్విచక్ర వాహనంపై జాతీయ రహదారి మీదుగా ఏటూరునాగారం వస్తుండగా రొయ్యూరు గ్రామానికి చెందిన ఒకరు ద్విచక్ర వాహనంపై వస్తూ వెనుక నుంచి ఢీ కొట్టారు. దీంతో రఘు దంపతులు కింద పడ్డారు. రఘు గాయపడ్డాడు. వెంటనే మండల కేంద్రంలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స అందించారు.

## లారీ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 14 : లారీ ఢీ కొని మహిళకు తీవ్ర గాయాలైన ఘటన భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన సుగుణ శనివారం భూపాలపల్లి మండలంలోని ఎస్ఎం కొత్తపెల్లిలో నివసిస్తున్న తన చెల్లెలు ఇంటికి బయలుదేరి చెల్పూర్ గ్రామంలో బస్సు దిగింది. అక్కడి నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి గ్రామం వద్ద పరకాల వైపు అతివేగంగా వెళ్తున్న ఇసుక లారీ ఢీ కొట్టింది. దీంతో సుగుణకు కాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పీఈటీ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించాలి

కాటారం, డిసెంబర్ 14 : అశోక్‌నగర్ సైనిక్ స్కూల్‌లో పీఈటీగా పని చేస్తూ విధి నిర్వహణలో రైలు ఢీకొని మృతి చెందిన వీరన్న కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గ్రేషియా అందించి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని గిరిజన గురుకులాల పార్ట్‌టైం ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి రాజు, గురుకుల కళాశాల అధ్యక్షుడు మంథెన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలోని ఎస్టీ బాలుర గురుకులంలో పలువురు అధ్యాపకులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి వీరన్న మృతికి శ్రద్ధాంజలి ఘటించారు. ఎందరో రాష్ట్ర, జాతీయ క్రీడాకారులను తయారు చేసిన వీరన్న సొసైటీ స్కూల్ విద్యార్థులను తీసుకవెళ్లే క్రమంలో మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సంపత్, రజిత, కృష్ణమాచారి, రామకృష్ణ, రాజయ్య, సంతోష్, గోపాల్ కృష్ణ, శ్రావణ్, వంశీకృష్ణ, స్వప్న పాల్గొన్నారు.

## బస్సు కిందపడి వృద్ధురాలి మృతి

కన్నాయిగూడెం, డిసెంబర్ 14 : బస్సు కిందపడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే దేవాదుల గ్రామానికి చెందిన వృద్ధురాలు చిలుముల లక్ష్మి(70) బుట్టాయిగూడెంలోని తన కూతురు ఇంటికి వచ్చి తిరిగి వెళ్లేందుకు బుట్టాయిగూడెం తాటిచెట్ల బస్‌స్టేజీ వద్ద వచ్చింది. ఏటూరునాగారం నుంచి తుపాకులగూడెం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు కాలు పెట్టగానే డ్రైవర్ నిర్లక్ష్యంతో బస్సు పోనిచ్చాడు. ఫుట్‌బోర్డు దగ్గర చీరకొంగు ఇరుక్కొని కిందపడగా బస్సు వెనక టైర్ పైనుంచి పోయి అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన ప్రయాణికులు అరవడంతో డ్రైవర్ బస్సును ఆపినట్లు తెలిపారు. డ్రైవర్ బస్సును ఆపినట్టే ఆపి పోనియ్యడం వల్లనే ప్రమాదం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం తరలించారు. బస్సును అక్కడినుంచి పోలీస్‌స్టేషన్ వద్దకు తరలించారు. మృతురాలి చిన్న కుమారుడు చిలుముల బాలకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.
NT-338978-AII

**CHANGE OF NAME**

★I, FASAHATH MIRZA F/o MIRZA RUMAYSA FATHIMA, R/o: 1-8-376, BALASAMUDRAM COLONY, HANUMAKONDA DESTRICT, 506001, WE HAVE CHANGED OUR DAUGHTER NAME as RUMAYSA FATHIMA
NTW-7706

**RENT**

★3 Floors building for Rent, Each Floor has 3600sft. Ground Floor for Parking Place available, Opp: ASM Degree & PG Womens College, Fort Road, Warangal. M: 9849987808/8309884828
NTW-17386

**సెప్టిక్ ట్యాంక్ క్లినర్**

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

**PLOT FOR SALE**



★Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును. No Brokers. 9553973999 / 6303049720.
NT-326614

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565